సాక్షి వికారాబాద్

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



మొదటి అడుగు

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఊరూవాడా మొక్కలు నాటేందుకు అడుగులేస్తుంది. 8లో ▸



ముగిసిన మల్లన్న జాతర

గౌతపూర్‌లో మల్లికార్జున స్వామి జాతర సోమవారంతో ముగిసింది. నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. 8లో ▸



ఇంటింటి సర్వే

ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. యాప్‌లో వివరాలు నమోదుస్తున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

‘పాలమూరు-రంగారెడ్డి’ పూర్తి చేయండి

ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీఆర్‌ఆర్, శంకర్

పరిగి: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్దండాపూర్ ప్రాజెక్ట్ వరకు నీటిని అందించేందుకు కాల్వల పనులు పూర్తయ్యాయన్నారు. పరిగి, షాద్ నగర్ ప్రాంతాల్లో దాదాపుగా 80వేల ఎకరాల సాగు నీటి కోసం ఏర్పాటు చేస్తున్న కేపీ లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళనలు నిర్వహించామని గుర్తుచేశారు.

రాష్ట్ర స్థాయి లగోరి పోటీలకు ఎనిమిది మంది విద్యార్థులు

కుల్కచర్ల: లగోరి జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ముజాహిద్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎనిమిది మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎం.మనీష, బి.శృతి, వి.నందిని, వి.అంకిత, గాయత్రి, పి.కిరణ్, విశాల్, రాకేశ్, ఎ.అరుణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ రెడ్డి, పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నరేందర్, ప్రభాకర్, పాండు, వెంకటేశ్, వెంకటయ్య, ప్రతిభ, మంజుల, సొనాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే అర్జీలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. ఈ వారం రెవెన్యూ శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలకు సంబంధించి 15 మొత్తం 67 వినతులు అందినట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇంటి సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటించాలని సూచించారు. తప్పిదాలకు తావు లేకుండా, పక్కగా పూర్తి పారదర్శకంగా వివరాలు సేకరించి ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన డైట్‌ను సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసిన గెజిటెడ్ అధికారులు



ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులంతా కలిసి పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కమార్‌నోరి, అసోసియేట్ అధ్యక్షుడు పీసీ వెంకటేశ్, ట్రెజరర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, అలివేలు మంగ, సంయుక్త కార్యదర్శులు అనిత, మంగ, సంయుక్త కార్యదర్శులు అనిత, సుజాత, సైదమ్మ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. చలి

ఇల్లు దాటనివ్వని వణుకు

- భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- బంట్వారంలో అత్యల్పం, దౌల్తాబాద్‌లో అత్యధికం
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, వృద్ధులు

చీకటి పడిందంటే చలి తీవ్రత పెరుగుతోంది. స్వెటర్లు, మఫ్లర్లు కట్టుకున్నా వణుకు ఆగడం లేదు. చలి కారణంగా చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. దట్టమైన పొగమంచు కమ్ముకుని వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చలికి తట్టుకోలేక జనం చలిమంటల చుట్టూ చేరుతున్నారు.



చలి మంటలు కాచుకుంటున్న జనం

తాండూరు: ఆరేళ్లుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. 2018 డిసెంబర్‌లో అత్యల్పంగా ఐదు డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా నాటి నుంచి ప్రతీ ఏడాది ఐదు నుంచి తొమ్మిది డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా సోమవారం ఈ సీజన్‌లో తొలిసారి అత్యల్ప ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వారం రోజులుగా ఎనిమిది డిగ్రీల నుంచి 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చలి పంజా విసిరింది. జిల్లాలోని నాలుగు మండలాల్లో 6.7 డిగ్రీలు, 6.8 డిగ్రీల వరకు అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంట్వారం మండలంలో 6.7 డిగ్రీలు, మర్పల్లి మండలంలో 6.8, పూడూరు మండలంలో 6.8, మోమిన్ పేట్‌లో 5.9 అత్యల్ప ఉష్ణోగ్రత నమోదై రికార్డు సృష్టించింది. వర్షాకాలంలో భారీగా కురిసిన వర్షాలతో లానినా ప్రభావంతో శీతాకాలంలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. ఈ సీజన్‌లో సోమవారం తొలిసారి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గిపోయి. దీంతో జనం గజగజ వణికిపోయారు. తెల్లవారు జాము నుంచి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావడంతో జనాలు చలిగాలులకు ఇబ్బందులు పడ్డారు. సూర్యోదయం ఏర్పడినప్పటికీ ఉదయం 9 గంటల వరకు చలిగాలులు ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. విద్యార్థులు చలి కారణంగా పాఠశాలలకు ఆలస్యంగా వెళ్లారు.

ఆదివారం రాత్రి నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత
బంట్వారం	6.7
మర్పల్లి	6.8
పూడూరు	6.8
మోమిన్‌పేట్	6.9
కోట్‌పల్లి	7.0
ధారూరు	7.8
పెద్దేముల్	8.8
వికారాబాద్	8.8
నవాబ్‌పేట్	9,2
కొడంగల్	9.3
బషీరాబాద్	9.4
యాలాల	9.5
కుల్కచర్ల	10
తాండూరు	10
దోమ	10.2
పరిగి	10.2
బొంరాస్‌పేట్	10.3
చౌడాపూర్	10.3
దౌల్తాబాద్	11.6

‘లానినా’ ఎఫెక్ట్

ఈ ఏడాది జిల్లాలో భారీగా వర్షాలు కురిశాయి. సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం నమోదు కావడంతో లానినా ప్రభావం శీతాకాలంపై పడిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరో వారం రోజుల పాటు చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పంటలపై ప్రభావం

కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల వ్యవసాయ పంటలపై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రధానంగా వరి నారుపై ప్రభావం పడుతోంది. రాత్రి సమయంలో వరి నారు మడులలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

‘పరీక్ష’ల్లో ఫెయిల్!



వికారాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎగ్జామ్స్ నిర్వహణలో యంత్రాంగం వైఫల్యం

- గతేడాది పదోతరగతి పరీక్ష పేపర్ లీక్
- ప్రస్తుత గ్రూప్–2లో మాల్‌ప్రాక్టీస్

పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న వైఫల్యాలు మరోసారి బయటపడ్డాయి. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలు యంత్రాంగం డొల్లతనాన్ని ఎత్తిచూపుతుండడంతో పాటు జిల్లాను అభాసుపాలు చేస్తున్నాయి. వికారాబాద్‌లోని శ్రీసాయి డెంటల్ కళాశాలలో ఆదివారం గ్రూప్- 2 రెండో పేపర్ రాస్తుండగా ఓ అభ్యర్థి సెల్‌ఫోన్‌తో పట్టుబడ్డాడు. టీఎస్‌పీఎస్సీ అధికారులతో పాటు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి రాత్రి 10 గంటలు దాటే వరకు ఈ సెంటర్‌లోనే ఉండి పరిస్థితిని సమీక్షించడం గమనార్హం.

వికారాబాద్: పరీక్షల నిర్వహణలో వైఫల్యాల పరంపర కొనసాగుతూనే ఉంది. గతేడాది 10వ తరగతి పరీక్ష పేపర్ లీక్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపడంతో పాటు జిల్లా అధికారులకు తలవంపులు తెచ్చిన విషయం విదితమే. తాజాగా జిల్లా కేంద్రంలోని గ్రూప్–2 పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌తో వెళ్లిన అభ్యర్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఘటన జిల్లాను మరోసారి వార్తల్లోకి ఎక్కించింది. ఎంత పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని చెబుతున్నా.. ఇలాంటి ఘటనలు వేలెత్తి చూపుతున్నాయి. సీఎం సొంత జిల్లాలోనే వరుసగా గతేడాది టెన్త్, ఈ ఏడాది గ్రూప్–2 పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి. జిల్లాలో మొత్తం 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 10,381 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు.

వాట్సప్‌లో పంపించారా..?

ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపడంతో పాటుగా ప్రతీ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా చూసుకోవడం పరీక్షా కేంద్రం నిర్వాహకులు చూసుకోవాలి. ఓ అభ్యర్థి మొబైల్ తీసుకెళ్లి చూసి రాస్తుండగా గుర్తించామని నిర్వాహకులు పేర్కొన్నారు. అభ్యర్థి పరీక్ష పేపర్‌ను వాట్సప్‌లో పంపి సమాధానాలు తెప్పించుకున్నారా..? గూగుల్‌లో తీసుకున్నారా..? అనే విషయంలో స్పష్టత రాలేదు. వాట్సప్‌లో పంపిస్తే పేపర్ లీక్‌గా పరిగణించాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కాగా ఈ ఘటనపై స్థానిక జిల్లా అధికారులు గానీ, పోలీసు అధికారులుగానీ స్పందించలేదు. ప్రెస్ నోట్ సైతం ఇవ్వలేదు. టీజీపీఎస్సీ అధికారులు కూడా మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన అభ్యర్థిని పట్టుకున్నామని చెప్పారే తప్ప ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఇందుకు సంబంధించి సెంటర్ నిర్వాహకులతో పాటు పర్యవేక్షణాధికారులు, అభ్యర్థి అందరిని బాధ్యుల్ని చేయాల్సి ఉండగా.. ఘటనకు గల కారణాలు గానీ.. బాధ్యులెవరనేది గానీ.. ఎవరిపై చర్యలు తీసుకున్నారని ఇప్పటి వరకు వెల్లడించకపోడం సైతం అనుమానాలకు తావిస్తోంది.

రెండో రోజు మరింత పటిష్ట చర్యలు

మొదటి రోజు గ్రూప్–2 పరీక్ష రెండో పేపర్ రాస్తుండగా వెలుగు చూసిన మాల్ ప్రాక్టీస్ ఘటనతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. పరీక్షల నిర్వహణలో మొదటి రోజు కేవలం సెంటర్ల నిర్వాహకులు మాత్రమే తనిఖీలు చేపట్టగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం సెంటర్ నిర్వాహకులతో పాటుగా పోలీసులు పోలీసులు సైతం అభ్యర్థులను తనిఖీ చేసి లోనకు అనుమతించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి మొదటి రోజు ఫార్మాలిటీగా రెండు మూడు పరీక్షా కేంద్రాలు విజిట్ చేయగా.. సోమవారం పదుల సంఖ్యలో పరీక్షా కేంద్రాలు విజిట్ చేశారు. అభ్యర్థుల తనిఖీలను ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షించారు.

బోర్డు తిప్పేసిన ‘చీట్’ఫండ్!

- రూ.2 కోట్ల వరకు టోకరా
- డీఎస్పీకి బాధితుల ఫిర్యాదు



డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్‌ఎల్‌ఎస్‌కే చిట్‌ఫండ్ బాధితులు

పరిగి: ఓ చిట్‌ఫండ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. చిట్టీల పేరుతో రూ.2కోట్ల వరకు వసూలు చేసి కస్టమర్లను రెండేళ్లుగా డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఈ ఘటన పరిగి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్‌లో ఓ అద్దె ఇంట్లో కొన్నేళ్ల క్రితం ఎస్‌ఎల్‌ఎస్‌కే చిట్‌ఫండ్ ఏర్పాటు చేశారు. రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు వందలాది మంది చిట్టీలు వేశారు. తొలుత చిట్టీ ఎత్తిన కస్టమర్లకు డబ్బులు త్వరగా అందజేసి ఆకర్షించారు. ఆతర్వాత చిట్టీ ఎత్తుకున్న కస్టమర్లకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. రెండేళ్లుగా ఈ రోజు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో విసిగిపోయిన కస్టమర్లు సోమవారం పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన వారికి సైతం డబ్బు ఇవ్వకుండా చేతులెత్తేసారని వివరించారు. ఇందుకు స్పందించిన డీఎస్పీ బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు.

యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక

షాద్‌నగర్: పట్టణంలోని ఠాగూ ర్ ఉన్నత పాఠశా ల ఆడిటోరియంలో రెండు రోజులుగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా సోమవా రం నూతన కమి టీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటప్ప, ఉపాధ్యక్షులుగా రాములయ్య, కల్పన, కోశాధికారిగా డాక్టర్ జగన్నథ్‌శర్మ, కార్యదర్శులుగా వెంకటయ్య, కిషన్ చౌహాన్, భగవంత్‌రాజ్, రామకృష్ణ, శివారెడ్డి, భువనేశ్వరి, నర్సింలు, బుగ్గరాములు, శ్యామలాదేవి, శంకర్‌నాయక్, మల్లేష్, అక్బర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రఘుపాల్, సభ్యులుగా బుగ్గరాములు, కృష్ణ, ఆంజనేయులు తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ రానున్న రెండేళ్లపాటు కొనసాగుతుందని ఎన్నికల పరిశీలకుడు సీహెచ్ రవి, ఎన్నికల అధికారి యాదయ్య తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు తీర్చాలి



దీక్షకు సంఘీభావం తెలిపిన ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ అమరేందర్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా కలెక్టరేట్ ఎదుట చేపట్టి రిలే దీక్షలు సోమవారం పదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ సంఘీభావం తెలిపింది. జిల్లా కన్వీనర్ అమరేందర్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలని, పర్మినెంట్ చేసి ఆదుకోవాలని, బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు భవాని శేఖర్, నాగార్జున, అంజయ్య, మహిపాల్, లింగస్వామి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి



ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు పనిచేసే చోట ర్యాంపులు, అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా చూడాలని కోరారు.

ముగిసిన గ్రూప్–2 పరీక్షలు



వికారాబాద్‌లోని ఓ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: ఆది, సోమవారాల్లో నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు నాలుగు పేపర్లు ప్రశాంతంగా ముగిశాయి. కాగా ఆదివారం వికారాబాద్‌లోని శ్రీ సాయి డెంటల్ కాలేజీలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. ప్రత్యేకంగా అధికారులు పర్యవేక్షణ చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పలు సెంటర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. ఇందులో కొన్ని సెంటర్లను ఇద్దరు కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,381 మంది అభ్యర్థులకు గాను ఉదయం పరీక్షకు 5,033 మంది అభ్యర్థులు హాజరు కాగా 5,348మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 5032 మంది అభ్యర్థులు హాజరవగా 5,349మంది అభ్యర్థులు గైర్హాజర్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగిసింది.



పూడూరు: ఎన్కేపలి మోడల్ స్కూల్‌లో ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

హైవే విస్తరణపై కాలయాపన



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే హైదరాబాద్- బీజాపూర్ రోడ్డు విస్తరణలో జాప్యం

- బీఆర్‌ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణపై అడుగడుగునా అబద్దాలే ప్రచారం చేస్తూ ప్రభుత్వాలు, అధికారులు కాలయాపన చేస్తున్నారని బీఆర్‌ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్జీటీ)లో ఉన్న కేసు విచారణకు కొంతమంది నాయకులతో ఈనెల 13న కలిసి వెళ్లి అసలు నిజాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ద్విసభ్య ధర్మాసనం అడిగిన సరైన నివేదికలను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అందించకపోవటంతోనే జాప్యం జరుగుతోందని తెలిపారు. ఎన్జీటీ కోర్టు 2023 నవంబర్‌లో క్లియర్‌గా నాలుగు నెలల గడువు ఇచ్చి ఈఐఏ రిపోర్టు సమర్పించాలని, అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టొద్దని డైరెక్షన్ ఇచ్చిందన్నారు. కానీ అప్పటి ఈ ప్రాంత ఎమ్మెల్యే, ఎంపీలు ఎలాంటి అడ్డంకులు లేవు, రోడ్డు క్లియరెన్స్ వచ్చిందని తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. కోర్టు అడిగిన ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదన్నారు. ఇప్పుడు కొత్తగా ఈఐఏతోపాటు మరో జెడ్‌ఎస్‌ఐ రిపోర్టు జతచేయాలని కోర్టు కోరడం జరిగిందన్నారు. ఈనెల 16 వరకు మనకు అన్ని క్లియరెన్స్‌లు వస్తాయి, పనులు ప్రారంభిస్తామని హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలా చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు జరగకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం నాయకుడు దేశమొళ్ల ఆంజనేయులు, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కొడుకే పోయాడు.. రూ.లక్ష ఏంచేసుకోను

- కాగ్నానదిలో స్నానానికి వెళ్లి మృతిచెందిన యువకుడు
- మిన్నంటిన తల్లి రోదన

ధారూరు: చేతికొచ్చిన కొడుకే పోయాక.. మీరిచ్చే లక్ష రూపాయలు ఏం చేసుకోవాలని ఓ తల్లి గుండెలవిసేలా రోదించింది. తన కుమారుడిని జాతరకు తీసుకువచ్చి అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని కన్నీటి పర్యంతమైంది. ఏఎస్‌ఐ సంగమేశ్వర్ తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ గ్రామానికి చెందిన స్వీటీ, శరత్ దంపతుల పెద్ద కుమారుడు రాహుల్(20) కొత్తూరుకు చెందిన పిల్లి నర్సింలు టెంట్‌హౌస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కోహీర్‌కు చెందిన సందీప్‌కుమార్ ఆదివారం తన కూతురు పుట్టు వెంట్రుకలు తీసేందుకు ధారూరులోని మెథడిస్ట్ జాతర ప్రాంగణంలోని క్రీస్తు శిలువ వద్దకు వెళ్లాడు. తనకు చేదోడుగా ఉంటాడనే ఉద్దేశంతో కూలీ ఇచ్చి, రాహుల్‌ను వెంట తీసుకెళ్లాడు. మధ్యాహ్నం వేళ రాహుల్ పక్కనే ఉన్న కాగ్నానదిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. నదిలో దూకిన సమయంలో నీళ్లలోని బండరాయి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గంట దాటినా తిరిగిరాకపోడంతో సందీప్‌కుమార్ నది ఒడ్డుకు వెళ్లిచూడగా.. దుస్తులు కనిపించడంతో నీటిలో మునిగిపోయి ఉంటాడని భావించి, డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. ఫైర్ ఇంజన్‌తో చేరుకున్న పోలీసులు ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం జాడ దొరకలేదు. సోమవారం కోట్‌పల్లి ప్రాజెక్టు బోటింగ్ లైఫ్ గార్డ్స్ శవాన్ని బయటకు తీశారు. రాహుల్ తల్లికి రూ.లక్ష ఇస్తానని సందీప్ చెప్పడంతో డబ్బులు ఏం చేసుకోవాలని స్వీటీ కన్నీటి పర్యంతమైంది. సమాచారం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు, కాగ్నానది నుంచి బయటకు తీసిన రాహుల్ మృతదేహం

క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పనిసరి

ఏఓ కరుణాకర్‌రెడ్డి

బంట్వారం: రైతులంతా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని కోట్‌పల్లి వ్యవసాయ శాఖ ఏఓ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భూసార పరీక్షలకు సంబంధించి కోట్‌పల్లి మండలం ఎంపికైందన్నారు. రైతులందరూ భూసార పరీక్షా పథకంలో పేర్లు నమోదు చేసుకుని తమ పొలం మట్టి నమూనాలను సిద్ధం చేయాలన్నారు. సేకరించిన మట్టి నమూనాలను రాజేంద్రనగర్‌లోని భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తామన్నారు. పంటల సాగుకు సంబంధించి భూసార పరీక్షలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న డీజిల్ ట్యాంకర్

పరిగి: కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి నగరానికి సుమారుగా ఆరు వేల లీటర్ల డీజిల్‌ను ఆదివారం రాత్రి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పరిగిలో పట్టుకుని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్యాంకర్‌ను సీజ్ చేశారు. కర్ణాటకలో మన రాష్ట్రం కన్నా లీటర్ డీజిల్ సుమారు రూ.10 ధర తక్కువగా ఉండడంతో ఈ అక్రమార్కులు ఈ దందాకు తెరలేపారు. నగరానికి ఒక్క ట్యాంకర్ తీసుకువస్తే రూ.లక్షకు పైగా అక్రమంగా ఆర్జిస్తున్నారు.

ఆటోకు నిప్పంటించిన దుండగులు



కాలిబూడిదైన ఆటో

పూడూరు: ఇంటి ఎదుట నిలిపిన ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి చెందిన జాంగీర్ తన ఆటోను ఇంటి ఎదుట పార్క్ చేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆటో నుంచి మంటలు ఎగిసిపడుతుండడంతో గమనించిన గ్రామస్తులను జాంగీర్‌కు చెప్పి మంటలార్పేందుకు యత్నించారు. కాగా అప్పటికే ఆటో కాలిబూడిదైంది. సోమవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఇబ్రహీంపట్నం: రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ క్రాస్ రోడ్డు సమీపంలో గల ప్రేమ్ రైస్ మిల్ పక్కన ఒక షెట్టర్‌లో పీడీఎస్ బియ్యం డంప్ చేసినట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. అనంతరం సోదా చేయగా.. 280 బస్తాల రేషన్ బియ్యం(సుమారు 14 టన్నులు) ఉన్నట్లు గుర్తించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ వాసి నరేష్ అనే వ్యక్తి.. రేషన్ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి, కోళ్ల ఫారాలకు విక్రయించేందుకు ఇక్కడ చాలా కాలంగా దాచాడు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. సివిల్ సప్లై గోదామునకు తరలించారు. నరేష్ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా రైస్‌మిల్లు పక్కన మడిగెలో బియ్యం డంపు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మొక్కల పెంపకానికి మొదటి అడుగు

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఊరూవాడా మొక్కలు నాటేందుకు వడివడిగా అడుగులేస్తుంది. దీనిలో భాగంగానే గ్రామాల్లో నర్సరీల ద్వారా మొక్కలను పెంచేందుకు అధికారగణం నిమగ్నమైంది.

- గ్రామాల్లో మొక్కల తయారీకి అధికారుల చర్యలు
- వానాకాలానికి నాటడమే లక్ష్యంగా అడుగులు



రోటిబండ తండాలో కవర్లలో మట్టిని నింపుతున్న కూలీలు

దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'వన మహోత్సవం' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రణాళికలు రచిస్తోంది. పరిసరాలు పచ్చదనంతో పరిఢవిల్లాలనే ఉద్దేశంతో గ్రామాల్లోని ప్రధాన వీధులు, చౌరస్తాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనుంది. అందుకు వర్షాకాలం అనువైనదిగా ఎంచుకున్నారు. వర్షాలు పడిన వెంటనే ఆయా ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తారు. ఈ మేరకు నవంబర్, డిసెంబర్ నెలల నుంచి గ్రామాల్లో నర్సరీల ద్వారా మొక్కలు పెంచుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలకు విత్తనాలు వేసేందుకు ఎర్ర, నల్లమట్టిని జల్లెడ పట్టి వాటి నుంచి సన్నని మట్టిని తీసి ప్లాస్టిక్ ప్యాకెట్లలో నింపుతున్నారు. దానిలో వివిధ రకాలు మొక్కలకు సంబంధించిన విత్తనాలను వేసి నీటిని పడుతున్నారు. మూడు నుంచి ఆరు రోజుల తర్వాత విత్తనం మొలకెత్తుతుంది. అలా మొక్కలను కాపాడుతూ వర్షాకాలం వరకు పెంచి పెద్దగా చేస్తారు. వానలు కురిసినప్పుడు వాటిని నాటుతారు. ఇందుకుగాను పూర్తి ఖర్చులు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. అందుకు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నర్సరీల నిర్వహణను పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో ఎంపీడీఓ ఉషశ్రీ నర్సరీని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న మొక్కలను జాగ్రతగా కాపాడాలని ఆమె సూచించారు.

గ్రామ పంచాయతీలదే బాధ్యత

నర్సరీల ఏర్పాటు, నిర్వహణకుగాను ప్రభుత్వం ఉపాధిహామీ, గ్రామ పంచాయతీ నుంచి ఖర్చు చేస్తుంది. తక్కువ జనాభా కలిగిన గ్రామాల్లో తక్కువ మొక్కలు పెంచడం, అధిక జనాభా, గ్రామ విస్తీర్ణం ఉన్న గ్రామాల్లో ఎక్కువ మొక్కలు పెంచుతామని అధికారులు చెబుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలకు 9వేల మొక్కల కంటే పైగా పెంచవచ్చని, చిన్న గ్రామ పంచాయతీలకు కనీసం 9 వేల మొక్కలు తగ్గకుండా పెంచాలని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. వీటి ఖర్చులు విడతవారీగా వస్తుందని తెలిపారు. విత్తనాలను డీఆర్డీఏ అందిస్తుందని, మొక్కలకు నిత్యం నీళ్లు పట్టేందుకు, వాటి నిర్వహణ చూసేందుకుగాను 100 రోజులకు ఒక ఉపాధిహామీ కూలీ ఉంటారని తెలిపారు. తర్వాత మరొక ఉపాధి కూలీ సహాయంతో నిర్వహణ కొనసాగిస్తామని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.



ఆలేడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉషశ్రీ (ఫైల్)

తల్లడిల్లిన తల్లి హృదయం

- రోడ్డు ప్రమాదంలో కుమారుడి దుర్మరణం
- దుద్యాల్‌లో విషాదం



బుగ్గప్ప (ఫైల్)



ఘటనా స్థలిలో కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

దుద్యాల్: చేతికొచ్చిన కుమారుడు కళ్లెదుటే విగత జీవిగా పడి ఉండడంతో ఆ తల్లి హృదయం తల్లడిల్లింది. ఉబికి వస్తున్న దుఃఖాన్ని కంటి నుంచి కార్చి బోరున విలపించింది. ఈ విషాద దృశ్యాలు చూపరులను కలచివేశాయి. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం దుద్యాల్ సమీపంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల్ గ్రామానికి చెందిన నీరటి బుగ్గప్ప(28) తన బైక్‌పై స్థానిక గేటు నుంచి సోమవారం ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న గ్రామానికి చెందిన గుండ్లపల్లి నర్సింలు ఎదురుగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో బుగ్గప్ప తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లి రుక్కమ్మ, కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న కొడుకుని చూసి తల్లి గుండెలవిసేలా రోదించింది. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో నర్సింలుకు ఎలాంటి గాయలు కాకపోవడంతో మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొంరాస్‌పేట్ ఎస్సై రహూఫ్ స్పందిస్తూ.. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మృతుడికి ఈ ఏడాదే వివాహం జరగ భార్య డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లింది. బుగ్గప్ప మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ధనుర్మాసం పూజలు సోమవారం వేకువజాము నుంచి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమాల మాదిరిగానే స్థానిక ఆలయంలో ఆగమ శాస్త్ర పద్ధతిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకొని ధనుర్మాసం ప్రారంభం అవుతుందన్నారు. ఉదయం 4 గంటలకు వాయిద్యం, 5 గంటలకు సుప్రభాతం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావైలోని మొదటి అధ్యాయాన్ని చదువుతూ గోదాదేవి అమ్మవారు చేసిన వ్రత విధానాన్ని భక్తులకు వివరించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

ముగిసిన మల్లన్న జాతర



ఒగ్గు కళాకారుల విన్యాసాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర సోమవారంతో ముగిసింది. నాలుగు రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మల్లన్న స్వామిని గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా గ్రామంలో ఆహ్లాద వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో ఆలయ పూజారి చంద్రయ్యస్వామితో పాటు గామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



అలంకరణలో స్వామివారు

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు చెన్న బసవయ్యస్వామి, కుమారస్వామిలు శివలింగానికి పంచామృతంతో రుద్రాభిషేకం చేయడంతో పాటు అలంకరించారు. నైవేద్యం సమర్పించి హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

మూర్ఛతో మెకానిక్ మృతి

పూడూరు: కాటన్ జిన్నింగ్ మిల్లులో ట్రాక్టర్‌కు మరమ్మతులు చేస్తున్న వ్యక్తి మూర్ఛతో మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనర్సింహ కాటన్ మిల్లులో అనీఫ్(45) ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సమీపంలోని సాయిబాబా కాటన్ మిల్లులో ట్రాక్టర్ చెడిపోవడంతో మరమ్మతులు చేసేందుకు సోమవారం అతడిని పిలుచుకెళ్లారు. మిల్లులో మరమ్మతులు చేస్తుండగా పిట్స్(మూర్ఛ) వచ్చి పడిపోయారు. వెంటనే అతన్ని అంబులెన్సులో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు కర్ణాటక రాష్ట్రం బల్లారికి చెందిన వాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

భోజనం ఎలా ఉంది?



తేకులగడ్డతండాలో విద్యార్థులతో ఎంఈఓ సహపంక్తి భోజనం

బొంరాస్‌పేట: పిల్లలూ.. మన పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందా..? అంటూ ఎంఈఓ హరిలాల్ మండల పరిధిలోని టేకులగడ్డతండాలో విద్యార్థులను అడిగారు. సోమవారం ఎంఈఓ పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం అమలులో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా? లేదా అంటూ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. టేకులగడ్డతండాలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఇందులో హెచ్‌ఎం గోపాల్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో యాచకురాలు మృతి చెందిన సంఘటన సోమవారం మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లి బైపాస్ రహదారి సమీపంలో వెలుగు చూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ(35) పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ అక్కడే నివసించేది. ఈ నేపథ్యంలో ఆమె మృతదేహం బైపాస్ సమీపంలో లభించింది. సదరు మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్యచేశారా, లేక మద్యానికి బానిసై చనిపోయిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బంపర్ ఆఫర్‌తో మోసపోయిన యువతి

పోలీసులకు ఫిర్యాదు

యాచారం: రూ.లక్ష విలువ చేసే స్కూటీని రూ.20 వేలకే ఇస్తామని గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన మాటలను ఆ యువతి నమ్మింది. డబ్బులు సైతం ఇచ్చింది. తీరా డబ్బులు తీసుకున్న వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయానని గ్రహించి, సైబర్‌క్రైం పోలీసులకు ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి మాల్ గ్రామానికి చెందిన హారిణికి.. కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి ఇరవై వేలకే స్కూటీని విక్రయిస్తామని చెప్పాడు. వెంటనే ఫోన్ పే లేదా స్కానర్ ద్వారా డబ్బులు పంపించాలని కోరాడు. దీనిని నమ్మిన ఆమె.. సదరు వ్యక్తి పంపించిన స్కానర్‌కు డబ్బులు పంపారు. రోజులు గడిచినా స్కూటీ ఇవ్వకపోవడంతో.. పాటు మరో రూ.3 వేలు పంపిస్తే స్కూటీని మీ ఇంటికి పంపిస్తామని నమ్మించే ప్రయత్నం చేయడంతో మోసపోయానంటూ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. డబ్బులు ఇప్పించాలని కోరింది.

అయోధ్యలో 'గీతా'పారాయణం



సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న గీతా వాహిని బృందం

అనంతగిరి: వికారాబాద్‌కు చెందిన గీతా వాహిని బృందం అయోధ్య రామమందిరంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం ఆదివారం రాత్రి చేశారు. రామమందిరం ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ యాగం చేసిన చోటే గీతావాహిని బృందానికి స్థలం కేటాయించి సంపూర్ణ పారాయణానికి అవకాశం కల్పించడం గీతావాహిని సభ్యుల పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు అధ్యక్షురాలు టి. శ్రీదేవి తెలిపారు. ఆలయం నిర్మాణం అనంతరం మొదటిసారి ప్రాంగణంలో సంపూర్ణ భగవద్గీతా పారాయణంకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన అయోధ్య రామాలయ ట్రస్ట్ కోశాధికారి స్వామి శ్రీ గోవిందదేవ్ గిరిజీ మహరాజ్, ఆయన శిష్యులు శిల్పాదిదికి, కృష్ణదేశ్‌ముఖ్, ధీరజ్‌శర్మలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతావాహిని ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కమిటీ సభ్యులు కరుణ, లక్ష్మి, ఝాన్సీరాణి, స్వాతి, సునీత, సరిత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు



హనుమాన్ ఆలయం గేటును వంచిన దొంగలు



ఇంటి తాళం ను చూపిస్తున్న అలీం

- ఆలయాలు, ఇళ్లలో చొరపడుతున్న దుండగులు
- ఆందోళనలో ప్రజలు

బషీరాబాద్: వరుస చోరీలు జనం కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వివరాలు.. ఈ నెల 13న హనుమాన్ ఆలయంలో అయ్యప్ప మాలధారణ స్వాములు స్థానిక హనుమాన్ ఆలయంలో నిద్రిస్తుండగా.. గుర్తు తెలియని దుండగులు ఆలయ గ్రిల్స్‌ను వెడం చేసి ఆలయంలోకి చొరబడ్డారు. ఆలయంలోని గల్లపెట్టె, చార్జింగ్ పెట్టిన మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిపోయారు. 14న పోలీసులకు ఫిర్యాదు చేయంతో సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడు సంజును అదుపులోకి తీసుకుని మొబైల్స్ రికవరీ చేసి వదిలేశారు. స్థానిక మైనార్టీ కాలనీలో చాంద్‌మియా, అబ్బాస్, వాజీద్, టైలర్ అలీం, అఫ్రోజ్ ఇళ్ల తాళాలు పగులగొట్టి చాంద్ మియా ఇంట్లో బ్యాగును దొంగిలించారు. అందులో కొంత డబ్బు, బంగారు ఆభరణాలు ఉండడంతో కుటుంబీకులు దొంగను వెంబడించగా బ్యాగు వదిలేసి పారిపోయాడని బాధితులు తెలిపారు. వారం రోజులుగా వరుస చోరీలతో ఆందోళన చెందుతున్నామని.. రాత్రివేళ పోలీసుల గస్తీ పెంచాలనీ ప్రజలు కోరుతున్నారు.

గస్తీ పెంచాం

బషీరాబాద్ మండల కేంద్రంలో పలు ఇళ్లల్లో చోరీకి యత్నించినట్లు తమ దృష్టికి వచ్చింది. ఇప్పటి వరకు చోరీ జరగలేదు. ఆలయంలో గ్రామానికి చెందిన ఆకతాయి సంజు అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లు చోరీ చేస్తే మూడు గంటల్లోనే రికవరీ చేశాం. రాత్రిళ్లు మండల వ్యాప్తంగా గస్తీ తిరుగుతున్నాం. త్వరలో దొంగలను పట్టుకుంటాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానితులు సంచిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. – పి.శంకర్, ఎస్ఐ



మద్వాపూర్- కోట్‌పల్లి లింక్ రోడ్డు దుస్థితి

అధ్వానంగా రోడ్డు.. వాహనదారుల పాట్లు

బంట్వారం: మట్టి రోడ్డుతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పాలకులకు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బంట్వారం మండల పరిధిలోని మద్వాపూర్ గ్రామం నుంచి కోట్‌పల్లికి వెళ్లే లింక్ రోడ్డు మట్టితో ఉంది. పంచాయతీరాజ్ పరిధిలోని ఈ రహదారి సుమారు 4 కిలో మీటర్లు ఉంటుంది. లింకు రోడ్డు కావడంతో వాహనదారులు ఎక్కువగా ఇటుగానే వెళ్తుంటారు. సల్బత్తాపూర్ మీదుగా వెళ్తే దూరం ఎక్కువవుతుందని మద్వాపూర్ వాసులు కోట్‌పల్లికి నిత్యం మట్టి రోడ్డుపై ప్రయాణిస్తున్నారు. వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత జరగడంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా కాలినడకనే వెళ్తుంటారు. కనీసం మెటల్ రోడ్డు వేసినా బాగుండేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డిని సంప్రదించగా రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్
- 20 నుంచి జీపీ కార్మికుల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న శ్రీనివాస్

తాండూరు రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సమ్మె నోటీసును తాండూరు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశామన్నారు. మల్టీ పర్పస్ వర్కర్లకు సంబంధించిన జీఓ 51ను సవరించాలని కోరారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం చలో హైదరాబాద్‌కు తరలిరావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు నర్సింలు, వెంకట్, అంబరప్ప తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

బంగారు నగలు, నగదు అపహరణ



చెల్లా చెదురుగా ఉన్న సామగ్రిని పరిశీలిస్తున్న సీఐ కాంతారెడ్డి

షాబాద్: తాళం వేసిన రెండు ఇళ్లలో దుండుగులు చొరబడ్డారు. నగదు, నగలతో ఉడాయించారు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం షాబాద్‌కు చెందిన కొండ సుధీర్‌కు చెందిన ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టి బీరువాలోని తులం బంగారం, 4 కిలోల వెండిని ఎత్తుకెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన రాహుఫ్.. కుమారుడి పెళ్లిని బంగారం ఆభరణాలు, ఇతర సామగ్రి ఇంట్లో పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. ఇది గుర్తించిన దుండగులు.. తాళాలు పగలగొట్టి.. బీరువాలోని 7 తులాల బంగారం, రూ.7లక్షల నగదును అపహరించారు. అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి యాదగిరి టీవీఎస్ ఎక్సెల్ మోటర్‌సైకిల్‌ను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇళ్లను పరిశీలించిన పోలీసులు.. క్లూస్‌టీంతో దుండగుల ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.